క్లుప్తంగా

పోటాపోటీగా రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ డివిజన్‌లో రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు రహస్య బ్యాలెట్ పద్ధతిలో బుధవారం మొదలయ్యాయి. డివిజన్ వ్యాప్తంగా రైల్వే ఉద్యోగులు ఎక్కడ విధులు నిర్వర్తిస్తున్నారో అక్కడే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధ, గురువారం జరిగే ఈ ఎన్నికల్లో మొదటి రోజు పెద్ద సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆర్‌పీఎఫ్, జిల్లా పోలీసులతో రైల్వే అధికారులు బందోబస్తు చేపట్టారు. పోటీలో ఉన్న కార్మిక సంఘం నేతలు రైల్వే స్టేషన్ వద్ద టెంట్‌లు వేసుకుని ఓటర్ల సమాచారం అందిస్తు తమ సంఘాలకు ఓటు వేసే దిశగా ప్రచారం చేశారు. ముఖ్యంగా ఎన్‌ఎఫ్ఐఆర్ (నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్)లో భాగస్వామి అయిన దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, ఏఐఆర్ఎఫ్ (ఆల్ ఇండియా రైల్వే ఫెడరేషన్)లో భాగస్వామి అయిన దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్‌లు ప్రధానంగా పోటీలో ఉన్నాయి. దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘం (డీఎంఆర్‌కేఎస్) తమ గుర్తింపు కోసం పోటీలో నిలిచింది. ఈ నెల 12న ఫలితాలను ప్రకటిస్తారు.

దుర్గమ్మ సేవలో టీటీడీ బోర్డు సభ్యుడు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను టీటీడీ బోర్డు సభ్యుడు, ఆర్ట్ డైరెక్టర్ ఆనందసాయి బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఆనందసాయికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వదించారు. ఆలయ డీఈఓ రత్నరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

అలరించిన భక్తి సంగీతం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన డాక్టర్ ఆకురాతి కోదండ రామయ్య బృందం ఆలపించిన భక్తి సంగీతం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై డాక్టర్ ఆకురాతి కోదండ రామయ్య, పాలవర్తి ఆంజనేయ శాస్త్రి, జగన్మోహిని బృంద సభ్యులు పలు కీర్తనలను వీనుల విందుగా ఆలపించారు. పాలవర్తి ఆంజనేయ శాస్త్రి వయోలిన్‌పై, జగన్మోహిని మృదంగంపై చక్కటి సహకారం అందించారు. అనంతరం ఆలయ మర్యాదలతో రామయ్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు ప్రసాదాలను అందజేశారు. ఆలయ డీఈఓ రత్నరాజు రామయ్య బృందానికి అమ్మవారి చిత్రపటం అందించి అభినందించారు. కార్యక్రమానికి ఆలయ అర్చకుడు చెరువు ఆదినారాయణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

స్టెల్లాలో ఎన్‌సీసీ నేవీ డే



పటమట(విజయవాడతూర్పు): దేశానికి సేవ చేయాలంటే విద్యార్థులు ఎన్‌సీసీలో చేరాలని ఎన్‌సీసీ 8వ ఆంధ్ర నేవీ కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ ప్రదీప్ అన్నారు. స్టెల్లా కళాశాలలో ఇండియన్ నేవీ డే వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకలకు కెప్టెన్ ప్రదీప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు ఇండియన్ నేవీలో సేవలు అందించాలని, అగ్నివీర్ పథకం గురించి తెలుసుకోవాలని పేర్కొన్నారు. 1971వ సంవత్సరంలో జరిగిన యుద్ధంలో నావికా దళం చేసిన వీరత్వాన్ని ఈ సందర్భంగా క్యాడెట్లకు వివరించారు. అనంతరం సబ్ లెఫ్టినెంట్ స్వప్న మాట్లాడుతూ.. భారత్ నావికా రంగం పాత్రను వివరించారు. అనంతరం పోస్టర్ కాంపిటీషన్ విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం కళాశాల నుంచి నిర్మల కాన్వెంట్ జంక్షన్ వరకు భారత నావికా దళం శాంతి ర్యాలీ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు వెంకట రమణ, రాజశేఖర్, సిద్ధార్థ కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ వెంకటేష్ ఆకురాతి, పలువురు ఎన్‌సీసీ క్యాడెంట్లు పాల్గొన్నారు.

కాలం తీరిన బస్సులు..
ప్రయాణానికి బ్రేకులు

- నిత్యం రోడ్లపై కదలనని మొరాయిస్తున్న సీఎన్‌జీ బస్సులు
- ప్రయాణం సాగక ఇబ్బందిపడుతున్న ప్రజలు
- కొత్త బస్సులను నడిపితేనే సమస్యకు పరిష్కారం



గత నెల మొదటి వారంలో అయోధ్యనగర్‌లో నిలిచిన ఆర్టీసీ బస్సు(ఫైల్)

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): కాలం తీరిన ఆర్టీసీ సిటీ బస్సులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్యాస్‌తో నడిచే సీఎన్‌జీ బస్సులు ప్రయాణం మధ్యలో హటాత్తుగా ఆగిపోతున్నాయి. ఎంత ప్రయత్నించిన ఆ బస్సులు కదలనని మొరాయిస్తున్నాయి. ప్రయాణికులు మరో బస్సునో, ఆటోనో ఆశ్రయించి ప్రయాణాన్ని కొనసాగించాల్సి వస్తోంది. అత్యవసర పనుల కోసం వెళ్తున్న ప్రయాణికులు సిటీ బస్సుల తీరుతో విసుగెత్తిపోతున్నారు.

ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం అని చెప్పే అధికారులు తమ ఇబ్బందులను మాత్రం పట్టించుకోవడంలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. బస్సులు పెక్కడపడితే అక్కడ ఆగిపోతే ప్రయాణం సురక్షితం ఎలా అవుతుందని ప్రశ్నిస్తున్నారు. బస్ టికెట్ కొనుగోలు చేసి, మళ్లీ ఆటోను ఆశ్రయించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ఫలితంగా బస్సుకు, ఆటోకు డబ్బులు చెల్లించడం ఆర్థికంగా భారంగా మారుతోందని వివరిస్తున్నారు. కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్త బస్సులను తీసుకొచ్చి నడపాలని కోరుతున్నారు. అత్యవసర పని విషయమై బస్సు ఎక్కిన పది నిమిషల్లోనే అది కదలకుండా ఆగిపోతోందని, అదేమని అడిగితే డ్రైవర్, కండక్టర్లు సాంకేతిక కారణాలు అంటున్నారని వివరిస్తున్నారు.

ప్రైవేటు వాహనాల వైపు మొగ్గు

ప్రజారవాణా సంస్థల్లోనే అతి పెద్దది గుర్తింపు ఉన్న ఆర్టీసీ క్రమేణా ప్రయాణికుల ఆదరణకు దూరమతోంది. ప్రయాణికుల సౌకర్యాలను పట్టించుకోకపోవటం, రద్దీకి తగినట్లు కొత్త బస్సులను ఏర్పాటు చేయకపోవటం, ఎప్పుడు అగిపోతాయో తెలియని కాలం చెల్లిన బస్సులను నడపడం ఇందుకు కారణమన్న అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది. తమ ఉన్నతాధికారులు తీరు కారణంగానే ప్రజలు ప్రైవేటు వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారని ఆర్టీసీ సిబ్బందే బహిరంగంగా చెబుతున్నారు.

15 ఏళ్లకు పైబడిన బస్సులే..

విజయవాడ నగర పరిధిలోని గవర్నర్‌పేట–1, 2, విద్యాధరపురం, ఇబ్రహీంపట్నం డిపోల పరిధిలో సుమారు 380 సీఎన్‌జీ బస్సులు ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయి. అయితే ఈ బస్సుల్లో 50 శాతం 15 సంవత్సరాలు దాటినవే కావడం గమనార్హం. ఆర్టీసీ అధికారులు కొత్త బస్సులను అందుబాటులోకి తీసుకురాకుండా కాలంతీరిన బస్సులనే నడుపుతున్నారు. అవసాన దశకు చేరిన ఆ బస్సులు ఎక్కడ పడితే అక్కడే ఆగిపోతూ ప్రయాణికుల సహనానికి పరీక్ష పెడుతున్నాయి.



గత నెల చివరి వారంలో సింగ్‌నగర్‌లో నిలిచిన బస్సు

రోడ్లపై నిరీక్షణ

పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, వివిధ పనులకు వెళ్లే కూలీలు, ప్రయివేటు ఉద్యోగులు ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లోనే రాకపోకలు సాగిస్తుంటారు. అయితే సీఎన్‌జీ బస్సుల్లో ప్రయాణం వారికి గుదిబండగా మారుతోంది. ఎక్కిన బస్సు ఎక్కడ అగిపోతుందో తెలియక, సమయానికి తాము వెళ్లాల్సిన చోటుకు చేరుకుంటమా లేదా అన్న ఆందోళనతోనే నిత్యం రాకపోకలు సాగించాల్సి వస్తోందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. బస్సు నిలిచిపోతే మరో బస్సు కోసం గంటల తరబడి రోడ్డుపై నిరీక్షించాల్సి వస్తోందని వివరిస్తున్నారు. అత్యవసరమైతే మళ్లీ చార్జీ చెల్లించి ఆటోలో వెళ్లాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. బస్సు నిలిచిపోయిందని తెలియని ప్రయాణికులు ఆ బస్సు కోసం గంటల తరబడి బస్ షెల్టర్ల వద్ద వేచిచూడాల్సి వస్తోంది.



రోడ్డుపై నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

గుంటూరు, అమరావతి రూరల్ మండలాల్లో తిరిగిన బస్సులను మా డిపోకు ఇచ్చారు. అందుకే మా డిపో నుంచి నడిపే బస్సులు సాంకేతిక లోపంతో అక్కడక్కడా నిలిచిపోతున్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పుడిప్పుడే ఆ బస్సుల స్థానంలో కొత్త బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటున్నారు. పాత బస్సుల కారణంగానే అక్కడక్కడా నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 15 సంవత్సరాలు తిరిగిన బస్సుల స్థానంలో కొత్త బస్సులు నడిపేలా ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

– సురేష్, గవర్నరుపేట–2 డిపో మేనేజర్

ఘంటసాల గాత్రశోభ అజరామరం



వేముల హజరత్తయ్య గుప్తాకు పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: ఘంటసాల గాత్రశోభ అజరామరమని ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. పద్మశ్రీ ఘంటసాల సంగీత కళావేదిక ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్ద ఘంటసాల జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడుతూ.. ఘంటసాల పాడిన భగవద్గీత ప్రజల్లో జ్ఞానజ్యోతిని వెలిగించిందన్నారు. చాలా మంది గాయనీగాయకులు ఘంటసాల పాటలు పాడుతూ ఉపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నంది పురస్కారాలతోపాటు, ఘంటసాల పేరుతో పురస్కారాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ ఘంటసాల సంగీత వేదిక వ్యవస్థాపకుడు బొబ్బిలి లీలాకుమార్ మాట్లాడుతూ.. ఏటా ఘంటసాల జయంతి సందర్భంగా పేదలకు వస్త్రదానం చేస్తున్నట్లు తెలిపారు. వేముల హజరత్తయ్య గుప్తాకు ఘంటసాల స్మారక పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో పైలా సురేష్, దేవతోట నాగరాజు, నరసింహారావు పాల్గొన్నారు. గాయనీ గాయకులు హరికృష్ణ, కామేశ్వరి తదితరులు ఘంటసాల గీతాలను ఆలపించారు.

కొణిజేటి రోశయ్య సేవలు అపూర్వం



కొణిజేటి రోశయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అందించిన సేవలు అపూర్వమని ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు అన్నారు. ఏపీ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ రోశయ్య వర్ధంతిని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గం ఆధ్వర్యంలో బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఉన్న త్రిమూర్తి చౌక్‌లోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. ముఖ్యఅతిథి కొనకళ్ల విద్యాధరరావు మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా వివిధ హోదాల్లో సుదీర్ఘ కాలం రోశయ్య సేవలందించారని కొనియాడారు. ఆయన చూపిన బాట అందరికీ ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయ రెడ్డి, బాపటి కోటిరెడ్డి, శిరంశెట్టి పూర్ణచంద్రరావు, నాయకులు షేక్ హయత్, అర్బన్ జిల్లా ఆర్యవైశ్య వివిధ విభాగాల అధ్యక్షులు గుడిపాటి కిషోర్, ఎండూరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను అడ్డుకోవాలి



వివిధ హిందూసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బంగ్లాదేశ్‌లోని హిందువులపై జరుగుతున్న దాడులను అడ్డుకోవాలని, అందుకు ప్రతి ఒక్కరూ తమ గళాన్ని వినిపించాలని పలు హిందూ సంఘాల నాయకులు పేర్కొన్నారు. హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ నగరంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. వన్‌టౌన్‌లోని గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ వివిధ ప్రధాన వీధుల మీదుగా కొత్తపేట నెహ్రూ బొమ్మ సెంటర్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ సంస్థ ప్రతినిధి ఫల్గుణ దాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, హనుమాన్ పీఠాధిపతి దుర్గాప్రసాద్‌స్వామిజీ, వివిధ సంఘాల ప్రతినిధులు సాతినేని యామిని, సానా శ్రీనివాసరావు, చక్రధర్, అవ్వారు బుల్లబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ల మరమ్మతులకు ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక ఊర్మిళానగర్ పరిధిలోని పలు ప్రదేశాల్లో తాగునీటి పైప్‌లైన్ల లీకులకు నగరపాలక సంస్థ అధికారులు మరమ్మతులు చేపట్టారు. పైపులైన్లు లీకయ్యి పెద్ద ఎత్తున తాగునీరు వృథాగా పోతున్న నేపథ్యంలో డివిజన్‌వాసులకు సక్రమంగా మంచి నీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వివరాలతో 'తాగునీరు వృథాగా పోతున్నా పట్టదా?' శీర్షికతో బుధవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వరరెడ్డి వచ్చి లీకుల కారణంగా వృథాగా డ్రెయిన్లలోకి పోతున్న తాగునీటిని పరిశీలించారు. 43వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి డివిజన్ పరిధిలో ఎక్కడెక్కడ పైప్‌లైన్లు లీకవుతున్నాయో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు చూపించారు. దీంతో ఈఈ వెంకటేశ్వరరెడ్డి లీకులకు ప్రాధాన్యతా క్రమంలో మరమ్మతులు చేయాలని, ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. సిబ్బంది వెంటనే మరమ్మతులు చేపట్టారు.



తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

తాగునీటి సరఫరాలో మరింత నాణ్యత పెంచాలి

పటమట(విజయవాడతూర్పు): తాగునీటి నిర్వహణలో నాణ్యమైన ప్రమాణాలను అమలు చేయాలని శాస్త్రవేత్త, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) విజయవాడ డైరెక్టర్ ఎం.ఎ.జె.వినోద్ సూచించారు. గుణదలలోని ఓ హోటల్‌లో బుధవారం మనక్ మంథన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన స్మార్ట్ వాటర్ మేనేజ్‌మెంట్‌పై వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్, సెర్ప్, మెప్మా అధికారులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వినోద్ మాట్లాడుతూ.. నగరాల్లో నీటి నిర్వహణ, పైపుల ద్వారా తాగు నీటి సరఫరా, నీటి నిర్వహణలో సాంకేతికతను మెరుగుపరచేందుకు అనువైన మార్గాలను అనుసరించాలని సూచించారు. బీఐఎస్ జాయింట్ డైరెక్టర్, సైంటిస్ట్ రమాకాంత్ సాగర్ తాగునీటి సరఫరాలో పైప్‌లైన్ ఫిట్టింగ్‌లు, నీటి అలారమ్‌లు, బిందుసేద్యం తదితర అంశాల్లో సాంకేతికతను అనుసరించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఏజే వినోద్

'ఆకుల'ను పరామర్శించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): పుత్ర వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట నాయకుడు ఆకుల శ్రీనివాస్ కుమార్‌ను మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం పరామర్శించారు. ఆకుల శ్రీనివాస్ కుమార్ చిన్న కుమారుడు డాక్టర్ రాజ్‌కుమార్ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో భవానీపురంలోని ఆకుల నివాసానికి వచ్చిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తొలుత రాజ్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్ కుమార్‌ను పరామర్శించి ఓదార్చారు. ఆకుల శ్రీనివాస్ కుమార్‌ను పరామర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, మాజీ మేయర్ తాడి శకుంతల, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌస్, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు యరడ్ల అంజనేయరెడ్డి, ఎండీ ఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి, అడపా శేషు, పార్టీ నాయకులు పొదిలి చంటిబాబు, అల్లం పూర్ణ, మేశం చిన్న, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్, కాంగ్రెస్ నాయకుడు కొలనుకొండ శివాజీ తదితరులు తదితరులు ఆకుల శ్రీనివాస్‌ను పరామర్శించారు.



రాజ్‌కుమార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో శ్రీనివాస్

రూ.9 వేలు ఇస్తే.. లోడు ఎంతైనా ఓకే

- ఎన్టీఆర్ జిల్లాలోని ఇసుక క్వారీల్లో దందా
- నందిగామ షాడో ఎమ్మెల్యే నేతృత్వం
- రెచ్చిపోతున్న విజయవాడ ప్రజాప్రతినిధి
- లారీలు వారివే.. ఇసుక లోడులు వారివే



కంచెల రీచ్‌లో అధిక లోడుతో ప్రజాప్రతినిధి తాలూకా టిప్పర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): టన్నులతో పని లేదు.. ఎంత ఇసుక కావాలంటే అంత లోడు చేసుకోవచ్చు. రూ.9 వేలు ఇస్తేనే ఈ వ్యహారం. ఇవ్వకుంటే లోడు లేదంతే. ఇదీ ఎన్టీఆర్ జిల్లాలోని ఇసుక రీచ్‌లలో టెండర్లు దక్కించుకున్న వారి దందా. దౌర్జన్యం, దుర్మార్గాన్ని కూడా దర్జాగా చేయగల గొప్ప ప్రభుత్వమని నిరూపిస్తున్నారు కొందరు కూటమి నాయకులు. జిల్లాలోని కంచెల, కాసరబాద, పెనుగంచిప్రోలు ఇసుక రీచ్‌ల కాంట్రాక్ట్‌ను బినామీ పేరుతో విజయవాడకు చెందిన ఒక ప్రజాప్రతినిధి దక్కించుకున్నారు. ఆయనకు ఉన్న 10, 12 టైర్ల లారీలతోపాటు తన స్నేహితులు, బంధువులతో మరి కొన్ని లారీలను కొనుగోలు చేయించారు. చేతికి మట్టి అంటకుండా నందిగామ షాడో ఎమ్మెల్యేను అడ్డం పెట్టుకుని మొత్తం మీద 30 నుంచి 40 లారీలను మూడు ఇసుక రీచ్‌ల్లో తిప్పుతున్నారు. ప్రభుత్వం టన్ను ధర రూ.140లుగా నిర్ణయిస్తే ఆ ప్రజాప్రతినిధికి చెందిన లారీలు బహిరంగ మార్కెట్‌లో రూ.500 చొప్పున విక్రయిస్తూ రోజుకు రూ.10 లక్షల వరకు ఆదాయం పొందుతున్నారు.

20 టన్నుల ఇసుక లోడు చెయ్యం

సామాన్యుడు తన సొంత అవసరాలకు ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకుంటే టన్నుకు రూ.140 చొప్పున 20 టన్నుల ఇసుక లోడు రూ.2800లుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న కస్టమర్ స్లిప్‌ను కిరాయి లారీ యజమానికి ఇస్తే అతను ఇసుక తీసుకొచ్చి కస్టమర్‌కు అందించాలి. అలా స్లిప్ తీసుకుని ఇసుక రీచ్‌కు వెళితే అక్కడ రోజుకు ఒక లోడుకూడా దొరకటం లేదని, ఒక్కో సారి రెండు రోజులు కూడా (ఒక లోడు కోసం) పడుతోందని విజయవాడ శాండ్ టిప్పర్, లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా అయితే తమకు కిరాయి గిట్టుబాటు కాదని వాపోతున్నారు. కానీ ఇసుక రీచ్‌లోని కూటమి నాయకులు మాత్రం ప్రజాప్రతినిధి తాలూకా లారీలకు నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడు (50 టన్నులు) ఎత్తుతున్నారు. ఆ లారీలు రోజూ ట్రిప్పుల మీద ట్రిప్పులు తిరుగుతున్నాయని చెబుతున్నారు. తాము కస్టమర్ ఇచ్చిన బుకింగ్ స్లిప్ ఇస్తే 20 టన్నుల లోడు చెయ్యబోమోని, రూ.9 ఇస్తే మాత్రం ఎంత ఇసుక కావాలన్నా తీసుకెళ్లొచ్చని రీచ్ సిబ్బంది తెగేసి చెబుతున్నారని అసోసియేషన్ సభ్యులు ఆరోపించారు. మంగళవారం కంచెల రీచ్‌కు లోడు కోసం వెళ్లిన లారీలు లోడు ఎత్తక పోవడంతో బుధవారం కూడా అక్కడే ఉన్నాయని, సుమారు 40 లారీల వరకు కాసరబాద రీచ్‌కు వెళ్లిపోయాయని చెప్పారు. దీంతో తాము ఇసుక రీచ్‌లలో పరిస్థితిపై నందిగామ ఆర్డీఓ, తహసీల్దార్, జేసీకి లేఖలు కూడా ఇచ్చామని, అయినా స్పందన లేదని తెలిపారు. కాగా ఇదే సమస్యపై ఏపీ రాష్ట టిప్పర్స్ అసోసియేషన్ సభ్యులు టీడీపీ కార్యాలయానికి వెళ్లి అక్కడ ఒక ఎమ్మెల్సీకి తమ గోడు వినిపించుకోగా ఆయన చూస్తామని చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం.

ప్రభుత్వ జీఓ 66ను తుంగలో తొక్కారు

గ్రామ సచివాలయాల్లో అనుమతి తీసుకుని ట్రాక్టర్ల ద్వారా ఆయా మండలాల్లోని కస్టమర్లకు మాత్రమే ఇసుకను తోలాలని ప్రభుత్వం జీఓ 66తో ఉత్తర్వులు ఇచ్చింది. అయితే కొందరు దానిని తుంగలో తొక్కి విజయవాడ నగరంలోకి వచ్చేసి ఇష్టారాజ్యంగా అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలోని ఇసుక రీచ్‌ల్లో ట్రాక్టర్లలో లోడు చేసుకుని వస్తున్న వారిని గొల్లపూడి బైపాస్ రహదారిలోని అట్కిన్‌సన్ స్కూల్ దగ్గరకు వచ్చేసరికి విజయవాడ శాండ్ టిప్పర్, లారీ ఓనర్ల అసోసియేషన్ సభ్యులు అడ్డుకోవడంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో అసోసియేషన్ సభ్యులు భవానీపురం పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా వారు చేతులెత్తేసారని చెప్పారు.

కొత్తపేట పరిధిలో వాహనాల తనిఖీలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఏక కాలంలో పోలీసులు వాహనాలను తనిఖీలు నిర్వహించారు. వెస్ట్ ఏసీపీ దుర్గారావు పర్యవేక్షణలో కొత్తపేట సీఐ చిన కొండలరావు నెహ్రూ బొమ్మసెంటర్‌లో ద్విచక్ర వాహనాలు, ఆటోల రికార్డులను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారితో రికార్డులు లేని వాహన చోదకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బ్రాహ్మణ వీధి, కోమల విలాస్ వైపు నుంచి వచ్చే వాహనాలతో పాటు పంజా సెంటర్, చిట్టినగర్ వైపు నుంచి వచ్చే వాహనాలను సైతం తనిఖీ చేశారు. దీంతో కొంత మంది ఆకతాయిలు, రికార్డులు లేకుండా వాహనాలను నడిపే వారు పక్క దారుల వెంట వెళ్లేందుకు ప్రయత్నించగా, వారిని సైతం పోలీసులు రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులు లేని వాహనదారులకు జరిమానాలు విధించినట్లు సీఐ కొండలరావు తెలిపారు.

ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించాలి

విజయవాడస్పోర్ట్స్: యూనిఫాం ధరించకుండా ఆటోలు నడిపితే చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. డ్రైవర్లు యూనిఫాం ధరించకపోవడంతో ట్రాఫిక్ క్రమశిక్షణకు ఇబ్బందులు వస్తున్నాయని, యూనిఫాం నిబంధన ఉల్లంగించి పట్టుబడిన వారికి మొదటి సారి అవగాహన కల్పిస్తామని, రెండోసారి జరిమానా విధించడంతో పాటు నిబంధనల ఉల్లంఘన నివేదికను రవాణా శాఖ అధికారులకు సమర్పిస్తామని వెల్లడించారు.

చంద్రబాబు మాట నిలబెట్టుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, నిర్వీర్యం చేసే చర్యలకు స్వస్తి పలకాలని ఏపీ రాష్ట వలంటీర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లంక గోవిందరాజులు డిమాండ్ చేశారు. 'వలంటీర్లు ఆవేదన అల్లాకు చెబుదాం' పేరుతో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కూటమి నాయకులు ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ వన్‌టౌన్ పంజా సెంటర్ వద్ద ఉన్న దర్గాలో బుధవారం సాయంత్రం వలంటీర్లు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా లంక గోవిందరాజులు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కూటమి నాయకులు చేసిన ప్రకటనలు బాధాకరంగా ఉన్నాయన్నారు. ఉగాది పండగ రోజు శుభవార్త చెప్తానని నమ్మబలికిన చంద్రబాబు తమ జీవితాలను తారుమారు చేశారన్నారు. శాసనమండలి సమావేశాల్లో వలంటీర్ వ్యవస్థ లేదని రాష్ట సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి ప్రకటించడం విచిత్రంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో కుటమి నాయకులకు వలంటీర్లు వ్యవస్థ లేదనే విషయం తెలియదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలోని 2,60,000 మంది వలంటీర్లకు న్యాయం చేస్తూ ప్రకటన చేయాలన్నారు. ఆ మేరకు జీఓ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వలంటీర్ల సంఘ రాష్ట కార్యదర్శి జి.మమత, నాయకులు రాజకుమార్, దమ్ము రమేష్, అబ్దుల్ జిలాని, పూజిత, ఆశాజ్యోతి, కల్యాణి, సోనీ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



దర్గా ఎదుట నిరసన తెలుపుతున్న వలంటీర్లు